క్లుప్తంగా

ఘనంగా దుర్గాదేవి రాట మహోత్సవం



ఉమ్మలాడలో దుర్గాదేవి రాట మహోత్సవం

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో ఆదివారం దుర్గాదేవి అమ్మవారి రాట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ రాట మహోత్సవానికి భక్తులు తరలివచ్చారు. వేప కొమ్మకు పసుపు, కుంకుమ అద్ది ప్రత్యేక పూజలు చేశారు.

ఏకాగ్రతతో చదివితే ఉన్నత లక్ష్యాలు



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రసాదరావు

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే పోటీ పరీక్షల్లో రాణించి, ఉన్నత లక్ష్యాలు చేరుకోగలుగుతారని విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రసాదరావు అన్నారు. మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని మంగళవరపుపేటలో విద్యార్థులకు జాతీయ ప్రతిభా ఉపకార వేతనం(ఎన్ఎంఎంఎస్)కు సంబంధించిన పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి ధనశ్రీను, డైరెక్టర్ ఆడారి సునీత, గ్రంథాలయాధికారి ఆడారి జగ్గప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి నియోజకవర్గ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం(మునగపాక): యలమంచిలి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం అచ్యుతాపురం మండలం కొండకర్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామన్నారు. కొండకర్ల ఆవ అభివృద్ధితో పాటు సెజ్‌లో అవసరమయ్యే సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

మునగపాక: మండలంలోని గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం నుంచి మూడు రోజుల పాటు మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, తదితర పోటీలు జరుగుతాయన్నారు. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు తాకిడి పెరిగింది. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవాడానికి రావడంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. అమ్మవారిని పూలు, నగలతో ప్రత్యేకంగా అలంకరించారు.

గొండుపాలెంలో పశలమ్మ పండగ

కె.కోటపాడు : గొండుపాలెం గ్రామస్తులు పశలమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఖరీఫ్ కాలంలో పండగను నిర్వహిస్తుండడం ఆచారంగా వస్తుంది. గ్రామంలో గల మహిళలు సతకం పట్టు వద్ద గల వేపచెట్టుకు పూజా కార్యక్రమాలను జరిపారు. అనంతరం గ్రామంలో వసంతకోత్సవం నిర్వహించారు.

ఆశాజనకంగా వరిసాగు

- లక్ష్యాన్ని మించి మండలంలో వరిసాగు
- ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 1362 హెక్టార్లు
- ప్రస్తుతం సాగు విస్తీర్ణం 1384 హెక్టార్లు



రైతులకు అవసరమయ్యే ఎరువులు



మునగపాకలో వరి పైరు

మునగపాక: వాతావరణం అనుకూలించడంతో వరి సాగు మండల వ్యాప్తంగా ఆశాజనకంగా సాగుతోంది. గతం కన్నా ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. చెరకు సాగులో తెగుళ్ల బెడద కారణంగా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. దీంతో వరిసాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. మూడు నెలల కాల వ్యవధిలో పంట చేతికి అందివస్తున్న నేపథ్యంలో మెజార్టీ రైతులు వరి సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

మండలంలో ఖరీఫ్ వరి సాగు సాధారణ విస్తీర్ణం 1362 హెక్టార్లు. అయితే ఇంత వరకు 1384 హెక్టార్లకు పైగా వరి సాగు జరిగినట్లు అధికారులు తెలిపారు. మరో 20 హెక్టార్ల మేర వరిసాగు జరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కొంతమేర వరికి నష్టం జరిగినా.. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో వరి రైతులు ఊరట చెందుతున్నారు. వర్షాల కారణంగా 111 హెక్టార్ల మేర వరికి నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించి నివేదికను ప్రభుత్వానికి అందజేశారు.

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు

రైతులకు అవసరమయ్యే ఎరువులను గ్రామాల్లో నిర్మించిన ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచారు. వరి, చెరకుతో పాటు అపరాల సాగుకు అవసరమయ్యే ఎరువులను ఇప్పటికే రైతులకు అందజేసేందుకు సిద్ధం చేశారు. రాయితీపై ఎరువులు అందజేస్తున్నారు. అయితే ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సలహాలు, సూచనలు చేస్తున్నారు. మోతాదుకు మించి ఎరువులను వినియోగించడం సరికాదని సూచిస్తున్నారు.

భారీ వర్షాలతో లక్ష్యం దిశగా వరినాట్లు

అనకాపల్లి డివిజన్ పరిధిలోని 24 మండలాల్లో ఆశించిన మేర వరిసాగు జరుగుతోంది. ఈ నెలలో కురిసిన వర్షాల కారణంగా 30 శాతం అధిక వర్షపాతం నమోదుకావడంతో 96 శాతానికి పైగా వరి నాట్లు పడినట్లు అధికారులు తెలిపారు. గత నెల వరకు వరి నాట్లు మందకొడిగా సాగినా ఈ నెలలో కురిసిన వర్షంతో ఆశించిన మేర వరిసాగు జరిగింది. అయితే వరికి సంబంధించి ఆకుముడత, కాండం తొలుచు పురుగులు ఆశించే అవకాశాలు లేకపోలేదని రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

నష్టంపై ప్రభుత్వానికి నివేదిక



వర్షాలు ఆశించిన మేర కురవడంతో లక్ష్యానికి మించి వరిసాగు జరిగింది. ఇటీవల కురిసిన వర్షాలకు కొంత మేర వరికి నష్టం జరిగినట్లు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపాం. ప్రస్తుతం వాతావరణం అనుకూలమైనప్పటికీ వరికి ఆకుముడత తెగులు సోకే ప్రమాదం ఉంది. ఇందుకోసం లీటరు నీటిలో 2 మిల్లీమీటర్ల క్లోరోఫైరిపాస్‌ను కలిపి పిచికారీ చేయాలి. తెగుళ్ల నివారణకు తగు చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్.జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి

అధ్వానంగా వేంపాడు రోడ్డు



వేంపాడు రామాలయం వద్ద రోడ్డు మధ్యలో పడిన గొయ్యి

నక్కపల్లి: జాతీయ రహదారి నుంచి వేంపాడు మీదుగా పలు గ్రామాలకు వెళ్లే మెయిన్ రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా వేంపాడు రామాలయం సమీపంలో రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు తప్ప ఆటోలు, కార్లు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. వర్షం పడిన సమయంలో ఈ గోతిలో నీరు చేరడంతో కాలువను తలపిస్తోంది. ఆదమరిస్తే ఈ గోతిలో పడి పెద్ద ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. జాతీయ రహదారి నుంచి వేంపాడు, నెల్లిపూడి, డీఎల్‌పురం, గునిపూడి, బంగారయ్యపేట, అమలాపురం, మూలపర, పాటిమీద, తమ్మయ్యపేట, బోయపాడు గ్రామాలకు రాకపోకలు సాగించే వారికి ఇదే ప్రధాన రహదారి. నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డు మీదుగా ఆయా గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. గ్రామం ప్రధాన జంక్షన్‌లోనే రోడ్డుకు అడ్డంగా పెద్ద గొయ్యి ఏర్పడడంతో గ్రామస్తులతో పాటు, ఇతర గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఎంపీటీసీ సభ్యుడు కుంచా మధు కోరారు.

ఇసుక లారీ, ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న లారీ, ట్రాక్టర్

నక్కపల్లి: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు వాహనాలను నక్కపల్లి పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సీఐ కుమారస్వామి తెలిపిన వివరాలు ప్రకారం.. డీఎల్ పురం సమీపంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను, రాజమండ్రి నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా వస్తున్న ఇసుక లారీని ఉపమాక రోడ్డు జంక్షన్ వద్ద పట్టుకున్నారు. వాహనాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు



రోడ్డు గతుకులకు మరమ్మతులు చేస్తున్న బంగారమ్మపాలెం యువకులు

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెం–రేవుపోలవరం గ్రామాల మధ్య రోడ్డు గతుకులమయమైంది. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడగా.. మరికొందరు క్షతగాత్రులయ్యారు. ఈ నేపథ్యంలో బంగారమ్మపాలెం యువత ముందుకొచ్చి సొంత నిధులు వెచ్చించి శ్రమదానంతో గోతులు పూడ్చే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ రెండు గ్రామాల మధ్య సుమారు 5 కిలోమీటర్లు దూరం ఉండగా, 3 కిలోమీటర్ల పరిధిలో గోతులు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం స్పందించే వరకు యువకులు చేసిన శ్రమదానంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి



బుచ్చెయ్యపేటలో రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ, యువకులు

బుచ్చెయ్యపేట : రక్తదానం చేసి ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాలు కాపాడాలని ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం రాత్రి మండల కేంద్రం బుచ్చెయ్యపేట, దిబ్బిడి గ్రామాల్లో వడ్డాదికి చెందిన అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సేవా సంస్థ అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి రోజు చేపట్టిన మెగా రక్తదాన శిబిరం విజయవంతం చేయాలని ఎస్ఐ యువకులతో కలిసి వీధుల్లో ప్రచారం చేశారు. వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్లో వెయ్యి మందితో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని మహిళలు, యువకులు అందరూ పాల్గొని రక్తదానం చేసి ఆపదలో ఉన్న వేలాది మందిని ఆదుకోవాలని ఎస్ఐ కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర రక్తదాన సేకరణ టీం లీడర్ బాలుతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పలువురు యువకులు పాల్గొన్నారు.

గురుకులంలో అవకతవకలపై ఫిర్యాదు

దేవరాపల్లి : తెనుగుపూడిలోని డా.బిఆర్.అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయంలో అవకతవకలు జరిగాయంటూ బి.కిశోర్ అనే వ్యక్తి సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను బ్లాక్‌లో అమ్ముకున్నారని, నాడు–నేడు కింద సరఫరా చేసిన బెంచీల్లో కొన్ని మరమ్మతులకు గురి కాగా, బాగు చేయించకుండా అక్రమంగా విక్రయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 8న నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరైన దళితులైన తల్లిదండ్రులను కటిక నేలపై కూర్చోబెట్టి అవమాన పరిచే రీతిలో ప్రిన్సిపాల్ జయప్రకాష్ వ్యవహరించారని ఫిర్యాదులో ఆరోపించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో స్థానికంగా ఉండాలని ఉన్నతాధికారుల ఆదేశాల బేఖాతరు చేస్తూ ప్రిన్సిపాల్ విధులకు హాజరు కాలేదన్నారు. దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయ అధికారి ఎస్.రూపావతిని ఫోన్ ద్వారా వివరణ కోరగా ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి, రుజువైతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ–క్రాప్ నమోదు గడువు నేటి వరకే

- ఈ కేవైసీ గడువు ఈ నెల 28 వరకూ
- మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి



మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి

రోలుగుంట : ప్రభుత్వం నిర్ణయించిన ఈ–క్రాప్ నమోదు సోమవారంతో ముగియనుంది. అలాగే ఈ–కేవైసీకి ఈ నెల 28 తో గడువు ముగియనుంది, రైతులు ఈ తేదీలలోపు వ్యవసాయ సిబ్బంది వద్ద తమ వివరాలు నమోదు చేయించుకొని ప్రభుత్వ రాయితీలు, ప్రభుత్వ పథకాలు పథకాలు పొందడానికి అర్హత పొందాలని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ– పంట నమోదు చేయించుకున్న రైతు ఈ–కెవైసీ చేయించుకుంటేనే ఈ–పంట ప్రక్రియ పూర్తవుతుందన్నారు. మీకు తెలిపిన ఈ వివరాలు నమోదు చేయకుంటే రాబోవు కాలంలో ధాన్యం అమ్ముకోవడానికి గాని, పంట బీమా కాని, ఈ–పంట ధ్రువపత్రం కాని, అన్నదాత సుఖీభవ డబ్బులు రైతుల ఖాతాలో పడే విషయంలో లబ్ధి చేకూరదన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనంలో ఉంచుకొని నమోదు చేయించుకొని అర్హులు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి సదరం క్యాంపు

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సదరం (ఎన్టీఆర్ భరోసా పెన్షన్ వెరిఫికేషన్) క్యాంపు సోమవారం స్వచ్ఛతా హీ సేవా–2024 కారణంగా మంగళవారానికి వాయిదా వేసినట్లు వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 24న రావికమతం, రోలుగుంట, మాడుగుల, 25న దేవరాపల్లి, బుచ్చియ్యపేట, చీడికాడ, 26న ఎస్.రాయవరం, మాకవరపాలెం, చీడికాడ మండలాల దివ్యాంగులకు సదరం క్యాంపు ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. గతంలో సదరం సర్టిఫికెట్‌లో 80 శాతం పైబడిన దివ్యాంగులు మాత్రమే క్యాంపునకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

వరిలో పచ్చపురుగు తెగులు నివారించుకోండి



రోలుగుంట పొలంలో సోకిన పచ్చపురుగు తెగులు

రోలుగుంట : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి పొలాలను తెగుళ్ల ఆశించాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్ల సోకిన పొలాలను మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి సందర్శించి, రైతులకు తగు సూచనలు అందించారు. పొలంలో నిండుగా నీరు నిలిచిపోవడంతో పొలం ఏపుగా ఎదిగి పచ్చపురుగ తెగులు సోకిందన్నారు. ఒక దుబ్బుకి రెండు లేదా మూడు ఆకులు తెల్లగా గీకబడి, అందులో లార్వాలు కనిపిస్తే వంద దుబ్బుల్లో కనీసం అయిదు పైగా ఇలా కనిపిస్తే మందులు పిచికారి చేసుకోవాలని సూచించారు. ఎకరాకు కనీసం 15 నుంచి 20 చోట్ల పొలంలో అక్కడక్కడ పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దీని వల్ల పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు.

పురుగు ఉధృతి అయిదు శాతం మించి ఉంటే పురుగు మందుల పిచికారి ముందు పొడవాటి తాడు ఇద్దరు పట్టుకొని ఎదురెదురు గట్లపై గాని, పొలం మధ్యలో నడుచుకుంటూ పొలానికి అడ్డుగా తాడును వరి ఆకుల మీద నుంచి లాగినట్టయితే ముడుచుకొని ఉన్న ఆకుల్లో ఉన్న పురుగు రాలిపోతుందని తెలిపారు.

వరిలో ఆకుముడత ఆశించిన వెంటనే లక్షణాలు గమనించాక లేదా ఆకుముడత తొలి దశలోనే రెండు గ్రాముల కార్టాఫ్ హైడ్రో క్లోరైడును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని, లేదా ఎకరానికి 400 గ్రాముల కార్టాఫ్ పొడిమందు వినియోగించాలని సూచించారు. రైతులు వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలు పాటించి తెగుళ్ల నివారించుకోవాలన్నారు.

ఆ గణపతికి సేవకులు మహిళలే..



ధర్మవరంలో అన్నసంతర్పణలో వడ్డనకు సిద్ధంగా ఉన్న మహిళలు



పట్టణంలోని ధర్మవరం వీధిలో మహిళలు నెలకొల్పిన గణపతి మండపం

యలమంచిలి రూరల్: పట్టణంలోని ధర్మవరంలో ప్రత్యేక మండపంలో కొలువైన గణపతికి సేవలన్నీ మహిళలే అందించడం ప్రత్యేకత సంతరించుకుంది. మండపం, వినాయక ప్రతిమ నెలకొల్పడంతో పాటు రోజూ ఉత్సవాలకు సంబంధించిన సేవలన్నీ ధర్మవరం వీధిలో మహిళలే నిర్వహిస్తూ వినూత్నంగా నిలుస్తున్నారు. ఈ నెల 7వ తేదీ వినాయక చవితి మొదలుకుని ఇప్పటి వరకూ ఈ మండపం వద్ద జరిగే వేడుకలన్నీ మహిళల చేతుల మీదుగానే జరుగుతున్నాయి. ఆదివారం ఇక్కడ నిర్వహించిన అన్నసంతర్పణ సైతం మహిళలే అన్నీ తామై నిర్వహించారు. వంటల దగ్గర్నుంచి, వడ్డన వరకూ వారు ఉత్సాహంగా చేపట్టారు. వారికి ధర్మవరం ప్రజలు మద్దతుగా నిలిచారు.

భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనాలు



కొరుప్రోలు మెట్టపై గణపతి ఊరేగింపులో పులి వేషాలు



కుమ్మర వీధిలో విద్యార్థుల నృత్యాలు

ఎస్.రాయవరం: భారీ ఊరేగింపుల నడుమ గణేష్ నిమజ్జనాలు మండలంలో ఆదివారం ఘనంగా జరిగాయి. కొరుప్రోలు మెట్ట మీద శ్రీవరసిద్ధి వినాయకుడు ఊరేగింపులో విజయనగరం కళాకారులు పులి వేషాలు అలరించాయి. కుమ్మర వీధిలో గణనాథుడి నిమజ్జనోత్సవంలో గాజువాకకు చెందిన పలు పాఠశాలల విద్యార్థుల భరతనాట్యం ఆకట్టుకుంది. కొరుప్రోలు మెట్ట మీద మరో గణపతి మండపం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

వాడవాడలా అన్న సమారాధనలు



మునగపాక దళితవాడలో వినాయకుడిని దర్శించుకుంటున్న భక్తులు



మునగపాక బీసీ కాలనీలో అన్నసమారాధన

మునగపాక: మండలంలోని వినాయక మండపాల వద్ద ఆదివారం భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మునగపాక ఇందిరమ్మ కాలనీ, బీసీ కాలనీ, నందీశ్వర కళా ప్రాంగణం, పల్లపు వీధి, తదితర ప్రాంతాల్లో నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు. గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుతో లాభాలు



మొక్కజొన్న తోట

కోటవురట్ల: మొక్కజొన్న సాగు లాభాలు తెచ్చిపెడుతోంది. ఏడాది పొడవునా సాగు చేస్తూ పలువురు రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. నిత్యం అమ్మకాలతో రైతులు రెట్టింపు ఆదాయాన్ని పొందుతున్నారు. మండలంలో పలువురు రైతులు మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. లింగాపురం, జల్లూరు, యండపల్లి ప్రాంతాలలో ఎక్కువగా సాగు చేస్తుండగా రైతులే రహదారుల వెంబడి దుకాణాలు ఏర్పాటు చేసి రిటైల్ అమ్మకాలు సాగిస్తున్నారు. దాంతో మార్కెట్ ఆశీల బెడద లేకుండా నేరుగా రైతులే లాభాలను ఆర్జిస్తున్నారు. మొక్కజొన్న సాగుకు ఎకరాకు సుమారు రూ.10 వేలు ఖర్చు కాగా.. 3 నెలల్లోనే ఫలసాయం వస్తోంది. పెట్టుబడి పోను సుమారు రూ.30 వేలు వరకు ఆదాయం సమకూరుతోందని రైతులు చెబుతున్నారు. లాభాలు మెండుగా ఉండడంతో ఏడాది పొడవునా సాగు చేస్తున్నట్టు తెలిపారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థులు



క్రీడా పోటీల విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎంఈవో బి. పడాల్‌దాస్

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన మండల క్రీడా పోటీలు ముగిసాయి. ఈ పోటీలలో తెనుగుపూడి డా.బీఆర్. అంబేడ్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థులు అండర్–17 బాలుర విభాగంలో ఖోఖో, వాలీబాల్, చెస్‌లో విజేతలుగా నిలిచారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో దేవరాపల్లి హైస్కూల్ విద్యార్థులు, కబడ్డీలో దేవరాపల్లి కై రళీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అండర్–14, అండర్–17 బాలికల విభాగంలో డిస్కస్ త్రో లో ఎ. కొత్తపల్లి హైస్కూల్ విద్యార్థులు ఎస్.నాగమణి, పి.అఖిల నిలిచారు. అండర్–14, అండర్–17 బాలుర విభాగంలో డిస్కస్ త్రోలో ఎ. కొత్తపల్లి హైస్కూల్‌కు చెందిన సతీష్, జశ్వంత్ విజేతలుగా నిలిచారు. అండర్–17 బాలికల 600 మీటర్ల రన్నింగ్‌లో వేచలం హైస్కూల్ విద్యార్థిని రామలక్ష్మి, 800 మీటర్ల రన్నింగ్‌లో కేజీబీవీ విద్యార్థిని శ్రీలక్ష్మి, 100 మీటర్ల కేజీబీవీ విద్యార్థిని టి.శ్రీలక్ష్మి విజేతలుగా నిలిచారు. అండర్–17 బాలుర 100 మీటర్ల రన్నింగ్‌లో వేచలం విద్యార్థి బి. చైతన్య, అండర్–14 100 మీటర్ల రన్నింగ్‌లో వేచలం విద్యార్థిని టి.సిమ్రాన్, అండర్–17లో 200 మీటర్ల బాలికల విభాగంలో వేచలం విద్యార్థి బి. చైతన్య విజేతలుగా నిలిచారు. వీరికి ఎంఈవో బి.పడాల్‌దాస్, వి. ఉషారాణి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీ జి.తరుణేశ్వరరావు, పీడీలు బి.బాబూరావు, ఆర్.తమ్మునాయుడు, సూర్యప్రకాష్, కుమారి, కె.కృష్ణ, ఎస్.నాగేశ్వరరావు, కె.విజయ్,సంతోష్ పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

రోలుగుంట : మండలంలోని జె.నాయుడుపాలెం గ్రామంలో గల బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, సీట్లు మంజూరులో అవకతవకలకు చోటు లేకుండా రిజర్వేషన్ ప్రక్రియ అమలు చేయడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి జాను ప్రసాద్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జె.నాయుడుపాలెం గ్రామంలో రూ.2.45 కోట్లు ఏపీడబ్ల్యూఐడీఈ నిధులతో అన్ని హంగులతో భవనం నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ విద్యా సంవత్సరం వృథా కాకుండా విద్యార్థులకు మేలు చేసే విధంగా ఇక్కడ ప్రవేశాలకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా విద్యాశాఖ, ఎక్స్ అఫిషియో ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ప్రొసీడింగ్స్ ఏపీ సమగ్ర శిక్ష అనకాపల్లి అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. అనాథలు, బెంచ్‌మార్కు వైకల్యాలు, స్కూల్ డ్రాపవుట్‌లకు మొదటి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని, మిగిలిన సీట్లు రిజర్వేషన్లను అనుసరించి ఇతర అభ్యర్థులతో భర్తీ చేస్తామని తెలిపారు. ఈ నెల 30 తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తి కావల్సి ఉందని, అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు స్థానిక హెచ్ఎం, మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.